

జిల్లాలో ఎక్కడి నుంచైనా మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోవచ్చు

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్



కడప (క్రైం), అక్టోబరు5: మద్యంషాపుల కోసం జిల్లాలో ఎక్కడినుంచైనా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఏఈఎస్ వినోద్‌కుమార్ నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 139 దుకాణాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. కడప జిల్లాలో తొమ్మిదిస్టేషన్ల పరిధిలో ఇవి ఉన్నాయని ఎవరైనా ఎక్కడ కావాలన్నా దరఖాస్తు చేసుకోవచ్చన్నా రు. ఇతర జిల్లా వాళ్లు సైతం 9స్టేషన్ల పరిధిలో ఎక్కడి నుంచైనా దరఖా స్తు చేసుకోవచ్చన్నారు. మద్యం దుకాణం పొందిన వారు వారికి ఇష్టమైన చోట మద్యందుకాణం ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉందన్నారు. అయితే దేవాలయాలు, స్కూళ్లు, కళాశాలలకు 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 9న దరఖాస్తు చివరితేది అని 10న అన్ని దరఖాస్తులు పరిశీలిస్తామన్నారు. 11న జిల్లాపరిషత్‌లో కలెక్టరు సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. మద్యంషాపుల కోసం ఒకరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికి 110 దరఖాస్తులు వచ్చాయన్నారు.

కడపలో లలితా జ్యువెలరీ ప్రారంభం




లలితా జ్యువెలరీ ప్రారంభించిన అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్.. చిత్రంలో ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప (కల్చరల్), అక్టోబరు 5: కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద శనివారం లలితా జ్యువెలరీ షోరూం ప్రారంభమైంది. దీనిని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలసి లలితా జ్యువెలరీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంగారు ఆభరణాల వ్యాపార రంగంలో లలితా జ్యువెలరీ సంస్థకు మనదేశంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. అలాంటి సంస్థ 56వ షోరూంను కడప నగరంలో ప్రారంభించారన్నారు. షోరూం రాకతో కడప నగరాభివృద్ధితో పాటు ఇక్కడి వారికి ఉపాధి అవకాశాలు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం పట్ల నమ్మకంతో వందల కోట్లతో పెట్టుబడి పెట్టి కడపలో షోరూం ఏర్పాటుచేయడం ముదావహం అన్నారు. అనంతరం సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డబ్బులు ఎవరికీ ఊరికేరావని అన్నారు. కష్టపడితే గాని డబ్బులు రావని, కావున పైసా పైసా కూడబెట్టి సంపాదించే డబ్బులతో వివిధ షోరూంలలో ధరలను కంపేరిజన్ చేసుకుని ఎక్కడ తక్కువ ఉంటే అక్కడే బంగారు నగలు కొనాలన్నారు. ఎక్కడ షోరూం ఏర్పాటుచేసినా కూడా అక్కడ లోకల్‌గా ఉన్నవారికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత జిలానీ బాష తదితరులు పాల్గొన్నారు.

ఇంకా వారే..!

- వైవీయూ వీసీ నుంచి కార్పొరేషన్ ఏసీపీ దాకా..
- కీలక పోస్టుల్లో.. వైసీపీ బ్యాచ్ నియామకం
- వీళ్లే ఉంటే చంద్రబాబు ప్రభుత్వానికి చెడ్డ పేరే
- టీడీపీ అభిమానులు, జనం ఆవేదన



కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలు అవుతున్నా.. పాలనపై ఇంకా పట్టు బిగించలేదని అంటున్నారు. జిల్లాలో ఇప్పటికీ వైసీపీ వీరాభిమానులైన అధికారుల హవా కొనసాగుతోంది. ఇప్పటికీ జగన్‌ను భజన చేసేవారే ఇక్కడ కీలకమైన స్థానాల్లో కొలువుదీరుతున్నారు. ఒకరు లైంగిక ఆరోపణలకు కేరాఫ్ అయితే మరొకరు వైసీపీకి హార్డ్ కోర్ అభిమాని. మరో అధికారికి నోటు వాసన చూడందే నిద్రపట్టదు అన్నట్లుగా ముద్రపడ్డారని చెబుతారు. ఇలాంటి వారంతా జిల్లా కేంద్రం కడపలో ఉండటం గమనార్హం. జగన్ హయాంలో చక్రం తిప్పిన వీరు ఇప్పుడూ కొనసాగడం కలకలం రేపుతోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తరువాత 4.0 పాలన చూస్తారని చెప్పుకొచ్చారు. చంద్రబాబునాయుడు 1996లో సీఎంగా ఉన్నప్పుడు తన మార్కు అడ్మినిస్ట్రేషన్, సంక్షేమ పథకాలు చేపట్టారు. అందుకే జనం 1999లో మళ్లీ చంద్రబాబునే సీఎం చేశారు. అప్పట్లో పాలన విషయంలో ఆయన రాజీపడేవారు కాదు. ఇటీవల సీఎంగా మరోసారి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు మళ్లీ తనలో 4.0 పాలన చూస్తారంటూ చెప్పుకొచ్చారు. దీనిని అందరూ స్వాగతించారు. చంద్రబాబు మార్కు పాలన ఉంటుందని ఆశించారు. రాజకీయవత్తిడులు లేకుండా సిన్సియర్ అధికారులను కీలకమైన స్థానాల్లో నియమిస్తారని అందరూ అనుకున్నారు. కానీ జిల్లాలో కొన్ని కీలకమైన స్థానాల్లో నియామకం పొందిన అధికారులను చూస్తే వామ్మో వీళ్లా.. ఇలా అయితే ప్రభుత్వానికి డ్యామేజీ అనే విమర్శలు వస్తున్నాయి.

కడప కార్పొరేషన్‌లో..

కడప నగరం సీమ జిల్లాలకు నడిబొడ్డు. అంతకన్నా జిల్లాకు కూడలి. జిల్లా కేంద్రం. అలాంటి కడప కార్పొరేషన్ ఇంకా వైసీపీ చేతుల్లోనే ఉంది. నగర నిర్మాణంలో కీలకమైనది టౌన్ ప్లానింగ్ వ్యవస్థ. తులసివనంలో గంజాయి మొక్కలా టౌన్‌ప్లానింగ్‌లోకి అవినీతి ఆరోపణలున్న మునిరత్నం అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా రావడం కలకలం రేపుతోంది. ఈయన ప్రొద్దుటూరులో ఏసీపీగా పనిచేసిన సమయంలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రొద్దుటూరుకు రాక ముందు నెల్లూరులో పనిచేసేటప్పుడు ఏసీబీకి చిక్కారు. అనంతరం ప్రొద్దుటూరుకు వచ్చి వైసీపీ హయాంలో విశ్వరూపం చూపించారు. అప్పటి ముఖ్యనేత బామ్మర్దితో కలిసి పట్టణాన్ని దున్నేశారంటారు. తనదైన స్టైల్‌లో ఇక్కడ పనిచేసే అధికార యంత్రాంగాన్ని పంపించేసి ఏకఛత్రాధిపత్యానికి తెరలేపారంటారు. ఈయన హయాంలో అనుమతి లేని లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలకు ప్రొద్దుటూరును కేరాఫ్‌గా మార్చారంటారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరొందారు. ఎలా అంటే తోటి టీపీవోకే చాంబరు లేకుండా చేశారు. ప్రతి మున్సిపల్ సర్వసభ్య సమావేశంలోనూ ఈయనపైన కార్పొరేటర్లు ధ్వజమెత్తేవారు. నీవు మునిరత్నం కాదు.. మనీరత్నం అంటూ అటాక్ చేసేవారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా నీవు మాకు వద్దు బాబోయ్ అనే స్థాయికి వచ్చారు. అటువంటి వివాదాస్పద అధికారి జిల్లాలో కీలకమైన కడప సిటీకి ఏసీపీగా రావడం కలకలం రేపుతోంది. కడపలో అనుమతి లేని నిర్మాణాలు, అనుమతి లేని లేఅవుట్లు తొలగించాలనేది ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి లక్ష్యం. అందుకు తగ్గట్టుగా అనుమతిలేని లేఅవుట్లపై కొరడా ఝుళిపిస్తున్నారు. వీరి లక్ష్యానికి విరుద్ధంగా నడుచుకునే అధికారి కార్పొరేషన్‌లోకి రావడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఇక వచ్చిన వెంటనే ఆ సారు తనదైన స్టైల్‌లో సిబ్బంది పట్ల నిరంకుశంగా వ్యవహరించడం దుమారం రేపుతోంది.

అన్నింటా జగన్ ఫ్యాన్సే

పేరకే సర్వజన ఆసుపత్రి (రిమ్స్). ఇక్కడుండేదంతా వైసీపీ ఫ్యాన్స్. సూపర్‌స్పెషాలిటీ ఇతర విభాగాల్లో పని చేస్తున్న కొందరు కీలక అధికారులు వైసీపీ హార్డ్ కోర్ కావడం గమనార్హం. రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ సూపరింటెండెంట్ ఆర్.సర్వేశ్వర్‌రెడ్డి వైసీపీకి వీరాభిమాని అనే పేరుంది. ఇప్పుడు కూడా ఆయన అదే కీలకమైన పోస్టులో ఉన్నారు. ఇటీవల ఇక్కడ క్యాథ్ ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ పాటించలేదనే విమర్శలు ఎదుర్కొన్నారు. శిలాఫలకంలో తమ పేర్లు లేకపోవడంతో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సూపరింటెండెంట్‌ను నిలదీశారు.

యోగివేమన యూనివర్శిటీ, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలు ఉన్నాయి. వాటిలో కూడా జగన్ హయాంలో అడ్డగోలుగా వైసీపీ వారి బ్యాచే నియమితులయ్యారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చినా కీలకమైన పోస్టుల్లో వైసీపీ అభిమానులే ఉండడం గమనార్హం. యోగివేమన రిజిస్ట్రారుగా రెండురోజుల క్రితం తప్పెట రాంప్రసాద్‌రెడ్డిని నియమించారు. ఈయన వైసీపీకి వీరాభిమాని అని చెబుతారు. ఈయన లైంగికంగా వేధించాడంటూ గతంలో విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. అప్పట్లో దీనిపై కమిటీ విచారణ చేసి నిజమని తేల్చింది. ఇలాంటి వ్యక్తిని ఉన్నత విద్యాలయం రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇదే తరహాలో లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న క్రిష్టారెడ్డిని సైతం అంతకు ముందే యూనివర్శిటీ వీసీగా నియమించారు. ఈయన మాజీమంత్రి రోజా తన బంధువు అంటూ చెబుతుంటారు. వైసీపీపై తన భక్తిని ప్రదర్శిస్తారంటారు. అంతటి వైసీపీ అభిమానిని వీసీగా నియమించడం విడ్డూరం. ఇలా అన్నిచోట్లా ముఖ్యమైన పోస్టుల్లో వైసీపీ వీరాభిమానులను నియమించడం ఇప్పుడు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీ బ్యాచే కీరోల్‌గా ఉండడం చూసి వామ్మో వీళ్లా అంటున్నారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శశిభూషణ్‌రెడ్డి



పులివెందుల టౌన్, అక్టోబరు 5: మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా వంగల శశిభూషణ్‌రెడ్డి శనివారం విజయవాడ గురునానక్‌నగర్‌లోని ఏపీ మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారురాజుతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి మినహా మిగతా అన్ని పంటల దిగుబడులను రైతుల నుంచి సేకరించడంతో వాటికి గిట్టుబాటు ధర మార్క్‌ఫెడ్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. అలాగే సొసైటీలకు కావలసిన ఎరువులను సకాలంలో అందించి నాణ్యమైన పంట దిగుబడి కోసం మార్క్‌ఫెడ్ కృషి చేస్తుందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు సేవ చేసే భాగ్యం తనకు దక్కిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాశ్, పులివెందుల అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శ్రీరాములు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులు రూ.37.42 కోట్లు విడుదల

కడప (రూరల్), అక్టోబరు 5: ప్రధానమంత్రి కిసాన్ నిధి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ.37.42 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు ఆ మొత్తాన్ని 1,87,083 మంది అర్హులైన రైతుల ఖాతాలకు శనివారం జమ చేశారు. ఈ నిధులను శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ఆయా రైతు సేవాకేంద్రాలలో లైవ్ ద్వారా రైతులకు చూపించే ఏర్పాట్లను చేశారు. దీంతో రైతు సేవా కేంద్రాలు సందడిగా కనిపించాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతి 4 నెలలకోసారి ఒక్కోరైతుకు రూ.2,000 చొప్పున పీఎం కిసాన్ నిధిని విడుదల చేస్తోంది. ఇప్పటివరకు జిల్లాకు 18 సార్లు పీఎం కిసాన్ నిధి మంజూరైంది.

శారదామాతా నమోస్తుతే..



కడప విజయదుర్గాదేవి ఆలయంలో చంద్రఘంట అలంకారంలో అమ్మవారు



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో శారదాదేవి అలంకారం

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజైన శనివారం జిల్లాలోని వివిధ ఆలయాలలో అమ్మవారిని పలు రూపాలలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రొద్దుటూరులోని అమ్మవారిశాలలో, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శారదాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మిగా భక్తులను కరుణించారు. కడప నగరంలోని అమ్మవారిశాల వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆకులవీధిలోని రాజరాజేశ్వరీదేవి గాయత్రిదేవిగా, చిన్నబెస్తవీధిలోని జగన్మాత ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో ప్రజలకు దర్శనమిచ్చారు. బిల్టప్ సమీపాన ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు చంద్రఘంట దేవిగా భక్తులను కరుణించారు. పులివెందుల పట్టణంలోని అమ్మవారి శాలలో శనివారం అమ్మవారు అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

- కడప(కల్చరల్)/ప్రొద్దుటూరు టౌన్



పులివెందుల పట్టణంలోని అమ్మవారిశాలలో అర్ధనారీశ్వర ఆలంకారం



కడప అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారం

మతసామరస్యానికి ప్రతీక అమీన్ పీర్ దర్గా

● 3 నుంచి 21 వరకూ ఉరుసు మహోత్సవాలు ● కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప (కల్చరల్), అక్టోబర్ 5: కడపలోని అమీన్ పీర్ దర్గా మత సామరస్యానికి ప్రతీక అని, నవంబర్ 3వ తేదీ నుంచి 21 వరకూ జరుగనున్న ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ప్రజలు హాజరై దిగ్విజయం చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అమీన్ పీర్ దర్గాలోని ముషాయిరా హాల్‌లో ఉరుసు ఉత్సవాల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లపై దర్గా పీఠాధిపతి జనాబ్ ఆరిఫ్‌ఉల్లా హుసేని అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఉరుసు మహోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని వారికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలని, సురక్షితమైన తాగునీటితో పాటుగా హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ మతసామరస్యాన్ని ప్రతిబింబించేలా అందరూ కలిసికట్టుగా పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ అధికారులు అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, నాయకులు అమీర్‌బాబు, హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, సుంకర శ్రీనివాస్, నజీర్‌అహ్మద్, జిలానీబాష, అధికారులు, పీఠాధిపతుల శిష్యబృందం తదితరులు పాల్గొన్నారు. సభా కార్యక్రమానికి ముందుగా వారు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఉరుసు నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

చేతి నిండా పని - చేతికందని మనీ

- రోజంతా కష్టపడినా తీరని వెతలు
- ఏడు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందులు పడుతున్న పారిశుధ్య కార్మికులు



సుండుపల్లె, అక్టోబరు 5: పరిసరాలు శుభ్రంగా ఉండాలని వేకువనుంచే పనిలోకి వచ్చి వళ్లు వంచి చేతినిండా పనిచేస్తున్నా చేతికి జీతం అందడం లేదు. ఒక్కరోజు వారు పనిచేయకపోతే రోడ్లపై నడవలేని పరిస్థితి. వందలాది కుటుంబాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను సేకరించి ఊరి బయటికి తరలిస్తున్నారు. అలాంటి పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో ఆదాయం వస్తున్నా జీతాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వివరాల్లోకెళితే....

వేకువనే పిల్లాపాపలను వదిలేసి విధుల్లోకి హాజరవుతారు పంచాయతీ కార్మికులు, మన ఊరు బాగుండాలని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను పోగు చేసి డంపింగ్ యార్డులకు తరలిస్తారు. ఒక్కరోజు పంచాయతీ కార్మికులు పనిచేయకపోతే రోడ్లపై నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి పంచాయతీ కార్మికుల కడుపు నిండడం లేదు. 7 నెలలుగా వారి కి రావాల్సిన జీతాలు ఇవ్వలేదు. రోజూ గొడ్డు కష్టం చేసే కార్మికులకు ఇవ్వడానికి పంచాయతీలో డబ్బు లు లేవా... వస్తున్న ఆదాయం ఏమవుతోందనే ప్రశ్నలు వెల్లువలా వస్తున్నాయి. పనులు చేస్తే కానీ కడుపు నింపుకోలేని పరిస్థితిలో ఉన్న కార్మికు లకు జీతాలు ఇవ్వకపోవడం హాస్యాస్పదమని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులకు చెప్పినా పంచాయతీలో నిధులు లేవని, ఇస్తామని డొంక తిరుగుడు మాటలు చెబుతున్నారని కొందరు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పంచాయతీ కార్మికులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఎందుకు ఏర్పడింది. పంచాయతీల్లో ఆదాయం ఎంత వస్తోంది, వస్తున్న ఆదాయం ఏమవుతోంద నేది ఐదేళ్లగా ఎవరికీ అంతుచిక్కడంలేదు. సుమారు 4 వేల కుటుంబాలు మండల కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. ఆదాయం ఉంటే ఆ ఆదాయం ఐదు నెలలుగా పంచాయితీ కార్మికులకు జీతం ఇచ్చేందుకు కూడా సరిపోవడం లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు. జీతాలు ఇచ్చి పుణ్యం కట్టుకోవాలని పంచాయతీ కార్మికులు అధికారులను వేడుకుంటున్నారు.

జీతాలు ఇవ్వకపోతే ఏం తినాలి



ఏడు నెలలుగా జీతం ఇవ్వడంలేదు. జీతాలు ఇవ్వకపోతే మా కుటుంబం ఏం తిని బతకాలి. రోజూ ప్రజల కోసం ఊరు బాగుండాలని కష్టపడు తున్నాము. వారానికి ఒకసారి సంతకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలన్నా నాకు స్థోమత లేదు. జీతం ఇచ్చి పుణ్యం కట్టుకోండి.

ఓబులమ్మ, పంచాయతీ కార్మికురాలు

ఎవరికి చెప్పినా ఫలితం లేదు



రోజూ గొడ్డు కష్టం చేస్తున్నాము. మా కష్టానికి ఫలితం ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వడం లేదు. కష్టపడి పని చేసే వారిని గుర్తించక పోవడం బాధగా ఉంది. వారం రోజులు పని చేయక పోతే గ్రామం చెత్తకుప్పలా మారుతుంది. మాకు రావాల్సిన జీతాలు ఇచ్చి మమ్మల్ని మా కుటుంబాన్ని ఆదుకోండి.

రమణయ్య, పంచాయతీ కార్మికుడు

రాజంపేట సబ్‌ట్రెజరీ ఉద్యోగులపై వేటు

'ఖజానాకు కన్నం'పై రాష్ట్ర డైరెక్టర్ సీరియస్

కడప(కలెక్టరేట్) అక్టోబరు5: రాజంపేట సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల అన్నమయ్య జిల్లా, రాజంపేట సబ్ డివిజన్ ట్రెజరీ కార్యాలయంలో స్ట్రాంగ్ రూములో నగదు బంగారు మాయంపై ఖజానాకు కన్నం అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ విషయంపై కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాలో ట్రెజరీ ఉద్యోగుల్లో పెద్ద చర్చ సాగింది. బంగారు, నగదు చోరీకి గురైందనే సమాచారం రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్‌కు చేరడంతో సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే ఏటీఓ అమీనుద్దీన్, సబ్‌ట్రెజరీ అధికారి రమేష్ రెడ్డి, షరాబు మురళీని సస్పెన్షన్ చేస్తూ రాష్ట్ర డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పాలనా పరమైన ఇబ్బందులు రాకుండా రాజంపేట ఎస్టీఓగా వెంకటరెడ్డి, ఏటీఓగా ఖాదర్ వల్లిని నియమించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అటెండర్ విష్ణు వర్ధన్ రెడ్డి కూడా పోలీసులకు సరెండర్ అయినట్లు తెలుస్తోంది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్ తస్లిమాకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5: రాష్ట్రంలో ఉపాధ్యాయుల జీవిత బీమా సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏపీజీఎల్ఐ కార్యాలయంలో సహాయ సంచాలకులకు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ బాండ్లు గడువు తీరిన ఉపాధ్యాయులకు చివరి మొత్తాలను చెల్లించడంలోనూ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు రుణాలు చెల్లించడంలోనూ ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోందన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన ఉపాధ్యాయులకు రావాల్సిన మొత్తాలను కుటుంబ సభ్యులకు చెల్లించడంలో జాప్యం జరుగతుందన్నారు. వెంటనే వీటిపై సమీక్షించి జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసులరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు 21 మంది ఎంపిక

రైల్వేకోడూరు, (రూరల్) అక్టోబరు 5: అంతర్ జిల్లాల తైక్వాండో పోటీల్లో 21 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి చమర్తి శారద, రాష్ట్ర కోచ్ హస్తి రవిశంకర్‌రాజు తెలిపారు. 11 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో 10 మంది, బాలికల విభాగంలో 11 మంది క్రీడాకారులు డిసెంబరు రెండో వారం మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫిజికల్ డైరెక్టర్స్ విజయ్ ప్రసాద్‌రెడ్డి, అరుణకుమారీ, సుబ్బరాజు, చంద్రమోహన్‌రాజు, ప్రసాద్‌వర్మ పాల్గొన్నారు.

కోదండరాముడి సేవలో సమాచార శాఖ కమిషనర్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కమిషనర్ సునీల్

ఒంటిమిట్ట, అక్టోబరు 6 : ఒంటిమిట్ట కోదండరాముడిని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్టు సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ విశిష్టత, చరిత్రను తెలుసుకున్నారు. తహసీల్దార్ రమణమ్మ, ఎస్ఐ శివప్రసాద్, టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సేవలో....

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 5: కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని శనివారం ఏపీ రాష్ట్ర సమాచార శాఖ కమిషనరు చావలి సునీల్ దర్శించుకున్నారు. దేవస్థాన మేనేజరు ఈశ్వరయ్య ఆచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కక్కయ్యమఠం సందర్శించారు. పెద్దిరెడ్డి రాం, సతీష్‌కుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, గుర్రంపాటి రమణరెడ్డి, వడ్డెమాను నాగేశ్‌నాయుడు, బి.మఠం డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, సాంబశివారెడ్డి, వీఆర్వో వినయ్, ఏఎస్ఐ గురప్ప, కానిస్టేబుల్ నాగేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిటోనేటర్లు పేల్చి వీఆర్ఏ హత్య

వివాహేతర సంబంధమే కారణం : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల టౌన్, అక్టోబరు 5: కొత్తపల్లి వీఆర్ఏ నరసింహులును డిటోనేటర్లు పేల్చి హత్య చేసినట్లు, ఇందుకు వివాహేతర సంబంధమే కారణమని డీఎస్పీ పి.మురళీనాయక్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వెల్లడించిన వివరాల్లోకెళితే....

వేముల మండలం కొత్తపల్లెలో గత నెల 29న వీఆర్ఏ నరసింహులు, సుబ్బలక్షుమ్మ దంపతులు ఇంటి ఆవరణలోని రేకులషెడ్డులో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి మంచం కింద బ్లాస్టింగ్ మెటీరియల్ ఉపయోగించి పేల్చడంతో నరసింహులు మృతి చెందగా, సుబ్బలక్షుమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆర్‌కే వ్యాలీ సీఐ నాగరాజు, వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం వేముల మండలం పాతకదిరి రోడ్డులో వాహనాల తనిఖీలో బాబును అదుపులోకి తీసుకుని విచారిస్తే నరసింహులు భార్యతో బాబు వివాహేతర సంబంధం నెరపేవాడు. విషయం తెలుసుకున్న నరసింహులు అతని కుటుంబ సభ్యులు బాబును మందలించారు. దీంతో మంచం కింద జిలెటిన్ స్టిక్స్‌ను బాబు పేల్చడంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. బాబును అరెస్టు చేసి, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరులో భారీగా పట్టుబడ్డ గోవా మద్యం

- పోలీసుల దాడులతో బహిర్గతమైన పొరుగుమద్యం దందా



భారీగా పట్టుబడిన గోవా మద్యం

ప్రొద్దుటూరు అక్టోబరు 5: ప్రొద్దుటూరులో పొరుగు మద్యం ఏరులై పారుతోంది. శనివారం వన్‌టౌన్ పోలీసులు జరిపిన దాడుల్లో గోవాకు చెందిన అక్రమ మద్యం భారీఎత్తున పట్టుపడింది. వివరాల్లోకి వెళితే ఎస్పీ ఆదేశాలమేరకు డీఎస్పీ భక్తవత్సలం కు రాబడిన సమాచారం మేరకు శనివారం సాయంత్రం పవర్‌హౌస్ వెనుక వున్న చెంగమాంబ కల్యాణ మండపం ఎదురు గదుల్లో భారీ ఎత్తున మద్యం పట్టుబడింది. వన్‌టౌన్ సీఐరామక్రిష్ణా రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు తనతో పాటు ఎస్ఐ సంజీవ రెడ్డి పోలీసు సిబ్బంది కలిసి జరిపిన దాడుల్లో ఖాళీగా వున్న ఆ గదుల్లో 816-750ఎంఎల్ మద్యం బాటిళ్ళు, 10 రెండులీటర్ల బాటిళ్ళు, 500 ఎంఎల్ బీరు బాటిళ్ల 72 అక్రమంగా నిల్వవుంచినట్లు గుర్తించామని తెలిపారు. ఈ గదిని వినాయకనగర్‌కు చెందిన హరి, అమృతనగర్‌కు చెందిన కాటం వీరేంద్ర నెల కిందట అద్దెకు తీసుకుని మద్యం, బీర్ల బాటిళ్లను నిల్వపెట్టినట్లు తెలిసిందన్నారు. ఈ మద్యాన్ని సీజ్‌చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషనుకు తరలించామన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు బాలికల జట్లు

పంగులూరు, అక్టోబరు 5: జాతీయ స్థాయి సౌత్‌జోన్ ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్ల ఎంపిక శనివారం పంగులూరులో జరిగింది. స్థానిక ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన అండర్-14, అండర్-17 బాలికల జట్ల ఎంపికలో కడడప నుంచి అండర్-14కు జి.హరిత, అండర్-17కు స్రవంతి ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు 16, 17, 18 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగే జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొంటాయన్నారు.

మహిళా డిగ్రీకళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5: ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో బీఏ, బీఎస్సీ బీకాం కోర్సుల్లో ప్రవేశాలకు 7 నుంచి 9 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఖలీల్‌బాషా తెలిపారు. కళాశాల కార్యాలయంలో అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. పొలిటికల్ సైన్స్ 6, హిస్టరీ 9, స్పెషల్ ఉర్దూ 29, స్పెషల్ ఇంగ్లీషు23, ఎకనామిక్స్ 4, బీకాం జనరల్ 6, బోటనీ 3, జువాలజీ 3, కెమిస్ట్రీ 14, ఫిజిక్స్ 8, మేథమేటిక్స్ 14, స్టాటిస్టిక్స్ 25, డేటా సైన్స్ 29 ఖాళీలున్నాయన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

ఖాజీపేట, అక్టోబరు 5: చెన్నముక్కపల్లె గిరిజనవాడ వాసి నాగభూషణం (28) ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు ఆకుమల్ల సుబ్బరాయుడు కుమారుడు నాగభూషణానికి ఏడేళ్ల కిందట వెల్లంవారిపల్లె వాసి శ్రీవిద్యతో వివాహమైంది. కొద్దిరోజుల నుంచి మద్యంతాగి ఇంటికి రావడంతో భర్త మారేందుకు ఆమె ముగ్గురు పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. నాగభూషణం మనస్థాపంతో శుక్రవారం సాయంత్రం ఉరివేసుకుని మృతిచెందాడు. భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

నిందితుల అరెస్టు - రిమాండుకు తరలింపు

కమలాపురం రూరల్, అక్టోబరు 5: హత్యకేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామ ని సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. కమలాపురం పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 3వ తేదీ సాయంత్రం 6.50 గంటలకు అప్పారావుపల్లెలోని సత్రం వద్ద రామక్రిష్ణారెడ్డిపై యల్లారెడ్డి, విశ్వనాథరెడ్డి, చెన్నారెడ్డి దాడి చేశారు. ఈ దాడి లో రామక్రిష్ణారెడ్డి చనిపోయాడు. కమలాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులు ముగ్గురిని శనివారం అరెస్టుచేసి కమలాపురం కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండుకు విధించిందన్నారు.

27 నుంచి హైదరాబాదుకు ఫ్లైట్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప విమానాశ్రయం నుంచి హైదరాబాదు వెళ్లడానికి డైరెక్ట్ ఫ్లైట్ తిరిగి ప్రారంభం కానుంది. 2014-19లో టీడీపీ పాలనలో ఉడాన్ పథకం ద్వారా కడప నుంచి విమాన రాకపోకలు ప్రారంభమయ్యాయి. అనతికాలంలోనే కడప విమానాశ్రయం నుంచి ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. ఎయిర్‌ట్రాఫిక్‌లో ద్వితీయ శ్రేణి ఎయిర్‌పోర్టు జాబితాలోకి వెళ్లిపోయింది. అలా కడప జిల్లా జనానికి ఫ్లైట్ కనెక్ట్ అయింది. అప్పట్లో రోజూ కడప-హైదరాబాదు, కడప-విజయవాడ, కడప-చెన్నైకి ఫ్లైట్లు నడిచేవి. అప్పట్లోనే విమానాశ్రయం విస్తరణకు బీజం పడింది. రాత్రి పూట విమానాలు రాకపోకలు సాగించేలా రన్‌వే అభివృద్ధికి నడుం బిగించారు. అనంతరం జగన్ అధికారంలోకి వచ్చాక రన్‌వే పనులు కొనసాగడం తప్ప ఫ్లైట్ల రాకపోకలపై దృష్టి పెట్టలేదు. దీంతో గతేడాది చివరి నుంచి కడప-హైదరాబాదు మధ్య రోజువారి ఫ్లైట్ నిలిచిపోయింది. ఉడాన్ పథకంలో భాగంగా ప్రభుత్వం తన వాటాను చెల్లించకపోవడంతో ఇండిగో ఫ్లైట్ సర్వీసు నిలిపివేసింది. దీంతో కడప నుంచి కేవలం వారంలో కొన్ని రోజులు మాత్రమే చెన్నై, వైజాగ్, బెంగళూరుకు ఫ్లైట్లు నడిచాయి. అప్పట్లో చంద్రబాబు హయాంలో రోజూ ఫ్లైట్‌లతో కళకళలాడే విమానాశ్రయం జగన్ వచ్చాక వారానికి మూడు రోజులుగా తయారైంది. టీడీపీ అధికారం చేపట్టి ఇటీవల చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. కడప నుంచి వ్యాపారం, ఇతరత్రా నిత్యం హైదరాబాదుకు వెళ్లే వారు విమానం లేక ఇబ్బంది పడుతున్నారంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. కడప-హైదరాబాదు మధ్య విమానాలు నడపాలంటూ లేఖలు రాశారు. ఈయన విజ్ఞప్తి మేరకు ఈ నెల 27 నుంచి ఇండిగో విమాన సంస్థ రోజూ కడప - హైదరాబాదు మధ్య విమానం నడపనుంది. దీనికి సంబంధించి విమానాశ్రయం అధికారిని వివరణ కోరగా.. 27 నుంచి విమానాలు హైదరాబాదుకు నడుస్తాయని, ఈ మేరకు బుకింగ్‌లు మొదలయ్యాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో ఆదర్శ విద్యార్థులు



పతకాలు సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, అక్టోబరు 5: ఎస్‌జీఎఫ్-19 రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రైల్వేకోడూరు జూనియర్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో భార్గవి, లహరి సిల్వర్‌మెడల్ సాధించగా తేజశ్విని బ్రౌన్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

కడప (క్రైం), అక్టోబరు 5: కోటిరెడ్డిసర్కిల్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకొండయ్య (60) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు బాలకొండయ్య కోటిరెడ్డి సర్కిల్ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవరుకు జైలు శిక్ష

సంబేపల్లె, అక్టోబరు5: సంబేపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి ఆటో నడిపిన కేసులో నిందితుడు వెంకట్రమణకు రాయచోటి కోర్టు నెల రోజుల జైలు శిక్ష విధించినట్లు సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. గతంలో వెంకట్రమణ మద్యం సేవించి ఆటో నడుపుతుండగా అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు



దువ్వూరు(మైదుకూరు), అక్టోబరు 5: రెండేళ్ల కుమారుడు కనబడలేదంటూ శనివారం దువ్వూరు పోలీసులకు తండ్రి తంగెడుపల్లె సాయికుమార్ ఫిర్యా దు చేశారు. సాయికుమార్ కుమారుడు అమర్ గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. బాలుడు చిలకపచ్చ రంగు దుస్తులు వేసుకుని ఉన్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తించిన వారు ఆచూకీ తెలియ చేయాలని పోలీసులు తెలిపారు.

కడప జిల్లాగానే కొనసాగించాలి

సీఎం చంద్రబాబుకు లేఖ

ప్రొద్దుటూరు, అక్టోబరు 5: వైఎస్ఆర్ కడప జిల్లా పేరును కడప జిల్లాగానే కొనసాగించాలని విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బొల్లవరం ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజ నిర్వహించి అనంతరం సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చారిత్రక విశిష్టత కలిగిన కడప పేరును తొలగించి వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చడం ప్రజలను తీవ్రంగా బాధించిందన్నారు. కార్యక్రమంలో సమితి నేతలు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మేస్వర్, డాక్టర్ రాజా రామ్మోహన్‌రెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జింకా సుబ్రమణ్యం, ఏపీ ఎన్జీఓ సంఘం తాలుకా ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 5: గండికోట ప్రాజెక్టుకు కృష్ణాజలాలు శనివారం నుంచి మళ్లీ వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా అవుకు రిజర్వాయిర్ నుంచి 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, మెయిన్ కెనాల్‌కు 50 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. వారం రోజుల కిందట గండికోటకు కృష్ణాజలాలను నిలుపుదల చేయగా ఇప్పుడు మళ్లీ విడుదల చేస్తున్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 24.84 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నేలవాలిన వరిపంటను పరిశీలించిన తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 5: మండలంలోని పలు గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో నేలకూలిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్నికోరారు. గాలివానకు వరిపంట నేలవాలి దెబ్బతిన్న అలిరెడ్డిపల్లె వరి పొలాలను పరిశీలించిన ఆయన నష్టం, పంటకు అయిన ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షానికి 150ఎకరాల్లో నేలకొరిగిన వరి

పెండ్లిమర్రి, అక్టోబరు 5: లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగుచేసిన వరిపంట అకాల వర్షానికి నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో బాధిత రైతులు తీవ్రమనోవేదనకు గురవుతున్నారు. మండలంలో పాపాఘ్ని నది తీర ప్రాంతాల్లో సాగైన దాదాపు 150ఎకరాల వరిపంట నేలకొరిగింది. రైతులు సుధీర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితర రైతుల వరి పంట పూర్తిగా నేలకొరిగింది. మరి కొద్దిరోజుల్లో కోతకోయాల్సి ఉండగా అకాల వర్షంతో లక్షలాది రూపాయలు నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. నేలకొరిగిన వరిపంటను మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు తువ్వపల్లెలో పరిశీలించారు. పడిపోయిన వరి పైరులో నీరు తీసివేసి ఆరబెట్టాలని సూచించారు. ఆరబెట్టిన వెంటనే గింజ నాణ్యతపోకుండా లీటరు నీటికి 50గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. విస్తరణ అధికారి గంగాధర్‌రెడ్డి, సిబ్బంది గణేష్‌కుమార్, నియాజుల్లా, రైతులు పాల్గొన్నారు.

రెండు ఎకరాల్లో అరటి పంట నష్టం

లింగాల, అక్టోబరు 5: మండలంలో గురువారం వీచిన గాలులకు రెండెకరాల్లో అరటితోట నేలకొరిగింది. అంబకపల్లె రైతు అరటి పంట గాలులకు నేలకొరగడంతో రైతుకు దాదాపు రెండు లక్షల రూపాయల దాకా నష్టంవాటిల్లిందని ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు.





అలిరెడ్డిపల్లెలో నేలవాలిన వరిపంటను పరిశీలిస్తున్న తులసిరెడ్డి - తువ్వపల్లెలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పంచాయతీ విస్తరణాధికారిగా కెజియా బాధ్యతల స్వీకరణ



కమలాపురం రూరల్, అక్టోబరు 5: కమలాపురం మండల పంచాయతీ విస్తరణాధికారిణిగా ఎల్.కెజియా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కడప డీబ్ల్యూఎంఎ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ కమలాపురంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న శారదమ్మ పులివెందులకు బదిలీ అయ్యారు.

ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు తదతర సమస్యలపై శ్రద్ధ పెడతామన్నారు. కాగా ఈఓపీఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన కెజియాను పందిళ్లపల్లె మాజీ సర్పంచ్ కంచంరెడ్డిరఘురామిరెడ్డి, రవీంద్రరెడ్డి, సాయినాథ్‌రెడ్డి, దాదిరెడ్డిపల్లె వీరాంజనేయులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

వెలుగు ఏపీఎంగా గంగాధర్ బాధ్యతలు

కమలాపురం మండల వెలుగు ఏపీయంగా గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలోచెన్నూరులో పనిచేస్తూ సాధారణ బదిలీపై కమలాపురానికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అపర్ణ ముద్దనూరుకు ఏపీఎంగా బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం మండలంలోని డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దశరథ మహారాజు ఆలయంలో అన్నదానం

చక్రాయపేట,అక్టోబరు 5: రాయచోటి-వేంపల్లెమెయిన్‌రోడ్డులోని దేవరగుట్టపల్లె సమీపంలోని దశరథమహారాజు స్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దశరథ, రాహుల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరాముడి తల్లిదండ్రులు కౌసల్య, సుమిత్ర, కైకేయి సమేత దశరథ మహారాజు దేవస్థానం నందు అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ శనివారం రాయచోటికి చెందిన సురేష్‌కుమార్‌రెడ్డి వారి సతీమణి దివ్యవాణి ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు రామసుబ్బయ్య, మాజీ సర్పంచు సుబ్బరామయ్య, భక్తులు పాల్గొన్నారు.

పండుగ పూట.. నీటికి కటకట

● వర్షాల వల్ల పెరిగిన భూగర్భ జలాలు ● రిజర్వాయర్లు ఫుల్.. అధికారుల నిర్వహణా లోపంతో సరఫరా నిల్ ● పలు ప్రాంతాల్లో ట్యాంకర్లతో సరఫరా

కడప (ఎర్రముక్కపల్లె), అక్టోబరు 5 : కడప కార్పొరేషన్ పరిధిలో నీటిసమస్య వేధిస్తోంది. దసరా నవరాత్రుల ప్రా రంభం నుంచి నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. గత వారం రోజులుగా కడప నగరంలో వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేసి దప్పిక తీర్చుకున్నా.. ఇతర అవసరాలకు సరిపడా నీరు లేక అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... కడప కార్పొరేషన్ పరిధిలో నాలుగు లక్షల జనాభా ఉన్నారు. వీరికి రోజుకు 54 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే కార్పొరేషన్ 49.92 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా చేస్తుంది. 4.08 ఎంఎల్‌డీ నీరు కొరత ఉంది. కార్పొరేషన్‌లో ప్రధానంగా లింగంపల్లె వాటర్‌వర్క్స్ నుంచి 30.36 ఎంఎల్‌డీలు, గండి వాటర్‌వర్క్స్ నుంచి 12 ఎంఎల్‌డీలు రామనపల్లె హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి 2 ఎంఎల్‌డీలు, పవర్ బోర్ల ద్వారా మరో 5.56 ఎంఎల్‌డీ నీరు ప్రతిరోజూ సరఫరా అవుతుంది. అ యితే ఈ మధ్యకాలంలో కురిసే వర్షాల వల్ల భూగర్భ జ లాలు పెరగడంతో నీటి కొరత లేదనే చెప్పాలి. కడప నగరంలోని కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఒక మారు నీరు సరఫరా జరుగుతోంది. గండి వాటర్ వర్క్స్, అలాగే లింగంపల్లె వాటర్‌వర్క్స్ పరిధిలో గల కాలనీలకు నాలుగు రోజులకొక మారు నీటిని విడుదల చేస్తున్నారు.ఈ విషయంపై కార్పొరేషన్ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో ప్రజలు ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గండి వాటర్‌వర్క్స్, లింగంపల్లె వాటర్‌వర్క్స్ ప్రాంతాలను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. గత పది సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది ఈ సమస్య వస్తున్నా కేవలం సంవత్సరానికి 8 లక్షలు పెట్టి రిపేర్లు చేస్తున్నారే తప్ప కొత్త మోటార్లు వేసే ప్రయత్నం చేయడంలేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కమిషనరుకు ఆదేశాలు జారీ చేశారు.

మారుతీనగర్‌లో..

కడప నగరం మారుతీనగర్‌లో సరఫరా అవుతున్న నీరు దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవు తున్నారు. డ్రైనేజీ నీటితో తాగునీరు కలుషితం అవుతున్నందునే దుర్వాసన వస్తోందని పేర్కొంటున్నారు.

పన్ను కడుతున్నా నీరు ఇవ్వరే..

నీరు రాలేదని ఫిర్యాదు చేసినా అధికారులు, సిబ్బంది ఫోన్లు ఎత్తడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. పన్ను లు మాత్రం కట్టించుకుంటారు కదా.. కనీసం తాగునీరు ఇవ్వలేరా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మోటార్లు మరమ్మతులు చేయించకపోవడంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా ఆ నీరు అవసరానికి ఉపయోగపడడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కడప నగరం నాగరాజుపేటలో ట్యాంకర్ల వద్ద గుమికూడిన ప్రజలు



కడప నగరంలో నీటి కోసం తిప్పలు పడుతున్న జనం

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5 : ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ రవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనాథ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 3 నుంచి 13 వరకు దసరా సెలవులు ప్రకటించిందన్నారు.ఈ సెలవుల్లో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు తరగతుల నిర్వహిస్తున్నారన్నారు. ఇటువంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు ముబారక్‌బాషా, తేజ పాల్గొన్నారు.

రిజిస్ట్రారు రాంప్రసాద్‌రెడ్డిని తొలగించాలి

● ఎమ్మెల్యేకు డీవైఎఫ్‌ఐ వినతి



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5 : లైంగిక ఆరోపణలు ఉన్న కీచక రిజిస్ట్రారు రాంప్రసాద్‌రెడ్డిని తొలగించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉన్నత విద్యాభివృద్ధిని నేర్పాల్సిన గురువు స్థానంలో ఉండి మహిళలను వేధించిన వ్యక్తి రాంప్రసాద్‌రెడ్డి రిజిస్ట్రారుగా నియమితులవడం దారుణమన్నారు. తక్షణం రాంప్రసాద్‌రెడ్డిని తొలగించాలని కోరారు. ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ సమస్యను తమ దృష్టిలో ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ నగర కన్వీనరు విజయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరి.. అఖిలాండేశ్వరి.. వందనం

కడప (కల్చరల్), అక్టోబరు 5: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం నగరంలోని వివిధ ఆలయాలలో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

విజయదుర్గాదేవి ఆలయంలో... విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు చంద్రఘంటా దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి శిరమున దాల్చిన అర్ధచంద్రుడు ఘంటాకృతిలో ఉండటం వల్ల అమ్మవారికి చంద్రఘంట అనే నామము స్థిరమైనది. ఆ రూపము మిక్కిలి శాంతిప్రదం, కళ్యాణకారకం. కాగా అమ్మవారికి 27 కలశాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం యాగశాలలో చండీహోమం, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. సాయంత్రం 4.30కు అన్నపూర్ణ ఆరాధన, (అన్నాభిషేకం) నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారు చంద్రఘంట దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 గంటలకు విజయదుర్గా- మల్లికార్జునులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.



విజయదుర్గాదేవి ఆలయంలో చంద్రఘంటా అలంకారంలో అమ్మవారు



కడప నగరంలోని సోమసుందరేశ్వర స్వామి ఆలయంలో మీనాక్షీదేవి అలంకారం



కడప:రాజరాజేశ్వరీదేవి ఆలయంలో గాయత్రీదేవి అలంకారం



కడప: బాలపోలేరమ్మ ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకారం



భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో రాజరాజేశ్వరిగా..



రామలింగచౌడేశ్వరీ దేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా...



కమలాపురం శాకంబరిదేవి అలంకరణలో అమ్మవారు



వీఎన్‌పల్లె: గాయత్రిదేవిగా తలపనూరు గంగమ్మ అమ్మవారు



పులివెందులలో మోహినీదేవి అలంకరణలో అంకాళమ్మదేవత



కడప: గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు (యర్రముక్కపల్లె)

మహిళలు చట్టాలపట్ల అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, అక్టోబరు 5: మహిళలు చట్టాలపట్ల అవగాహన పెంచుకోవాలని న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో శనివారం మహిళలకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపట్ల అవగాహన పెంచుకుని సత్వర న్యాయం పొందాలని, గృహహింస, వరకట్న వేదింపులు, లైంగిక వేదింపులు, సమాన వేతన చట్టం, ఫ్యాక్టరీల చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రీసోర్స్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ వన్‌స్టాప్ లక్ష్యాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్, వైద్యసాయం, పోలీసు సాయం తదితర వివరాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీదేవి, హసీనా, ఈవోఆర్‌డీ శ్రీధర్, సీఐ శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పులివెందుల రూరల్, అక్టోబరు 5: సింగం వెంకటనారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. లాయర్ కరుణాకర్‌రెడ్డి చేతులమీదుగా వీటిని అందించారు. వ్యాపార వేత్త భాస్కర్‌రెడ్డి, మెడికల్ ఏజెన్సీ యజమాని శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

సీకేదిన్నె, అక్టోబరు 5: చింతకొమ్మదిన్నె తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీఓ జాన్ ఇర్విన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఫ్రీహోల్డ్ భూముల వెరిఫికేషన్ చేశారు. పరిసరాలు, ఆఫీసు పరిశుభ్రంగా ఉంచుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు, ఆర్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పూజించే పండుగే బతుకమ్మ

● వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ విశ్వనాథకుమార్



బతుకమ్మ పండుగలో భాగంగా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5:ప్రకృతిని పూజించే పండుగే బతుకమ్మ పండుగ అని ఏఎఫ్‌ఏయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు జి.విశ్వనాథకుమార్ అన్నారు. శనివారం వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయనతోపాటు రిజిస్ట్రారు రాజేశ్‌కుమార్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలను ఏపీలోనే కాకుండా పలు దేశాల్లో జరుపుకుంటారన్నారు. విద్యార్థులు బతుకమ్మ చుట్టూ ఆటపాటలతో నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే స్వర్ణాంధ్ర సాధ్యం: పుత్తా



సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, అక్టోబరు 5: తెలుగు దేశం పార్టీతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన 16, 17, 18, 45 డివిజన్లలోని ప్రజలకు టీడీపీ వంద రోజులపాలనపై ఇది మంచి ప్రభుత్వం గు రించి శనివారం స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికను వివరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఎన్నికల హామీల్లో ఇచ్చిన సూపర్ -6 పథకాలను అమలు చేసి తీరుతుందని ఇప్పటికే పెన్షన్‌ను రూ.1000 పెంచి అందించడం జరిగిందని, అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారని, నిరుద్యోగులకు డీఎస్సీ నోటిఫికేషన్ అందించడంతోపాటు మహిళలకు దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు.

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. అలాగే మురుగుకాలువలు, తదితర సమస్యలు ఏమి ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, నరసింహులుయాదవ్, విజయ్, శంకర్, మునీంద్ర, సుబ్బిరెడ్డి, వీరకుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సిరాజ్‌బాష, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో డ్రౌట్ ప్రూఫ్ మోడల్



వి.కొత్తపల్లెలో డ్రౌట్ ప్రూఫ్ మోడల్ వేస్తున్న దృశ్యం

వేముల, అక్టోబరు 5: మండలంలోని వి.కొత్తపల్లె గ్రామ పరిధిలో శనివారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో డ్రౌట్ ప్రూఫ్ మోడల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ వర్షాధార భూముల్లో వినూత్న పద్ధతిలో మోడల్ ఏర్పాటు చేశామన్నారు. మూడు అడుగులకు ఒక గుంత తీసి ఆ గుతలో ఘనజీవామృతం వేసి విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి 3కు3 అడుగులకు ఆముదం తర్వాత కంది విత్తనాలు పెట్టారు. కంది, ఆముదం మొక్కలకు ఇరువైపులా ఒక్క అడుగుకు దూరంలో తూర్పు మొటిక, పడమర సజ్జ, దక్షిణం అనప, ఉత్తరం అలసంద పెట్టామన్నారు. కాలపరిమితిని బట్టి రెండు నెలల నుంచి పంట రావడం ఆరంభమవుతుందన్నారు. మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ శ్రీనాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎంటీ భాస్కర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, అంజన్‌రెడ్డి, సీడీఏ సుభాని, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

రేపు 'వీరశైవ సాహిత్యం-సామాజిక దృక్పథం' పుస్తకావిష్కరణ సభ

కడప (నాగరాజుపేట), అక్టోబరు 5 : వైవీయూ అనుబంధ సంస్థ సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సత్తెనపల్లి బాబు రచించిన వీరశైవ సాహిత్యం - సామాజిక దృక్పథం పుస్తకావిష్కరణ సభను 7వ తేదీ ఉదయం 10గంటలకు బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు పరిశోదన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి తెలిపారు. ముఖ్యఅతిథిగా వైవీయూ వీసీ ఆచార్య క్రిష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా రిజిస్ట్రారు ఆచార్య టి.రాంప్రసాద్‌రెడ్డి, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ, పాలక మండలి సభ్యుడు ఆచార్య మూలిమల్లికార్జునరెడ్డి రానున్నారని తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వర్తిస్తా

● పులివెందుల ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణ ప్రత్యూష



బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణ ప్రత్యూష

పులివెందుల రూరల్, అక్టోబరు 5: విధులను అంకితభావంతో నిర్వర్తిస్తానని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గనేష్ల భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష అన్నారు. శనివారం పులివెందుల ఆర్డీఓగా ఆమె బాధ్యతలు చేపట్టారు. ముందుగా పులివెందుల తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. తన చాంబర్‌లో పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీఓ మాట్లాడుతూ సమస్యలనుపరిష్కరించడంలో బాధ్యతవహిస్తానన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో ముందుకెళ్తానన్నారు. సీనీలు కేశవ, బాష, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులకు పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి

పులివెందుల టౌన్, అక్టోబరు 5 : మద్యం షాపులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1న మద్యంషాపులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైం దన్నారు. పులివెందుల ప్రాంతంలోని పలు మండలాలకు 16 షాపులు మం జూరయ్యాయని, అందులో పులివెందులకు ఏడు, వేంపల్లె, వేముల 1, చక్రాయపేట 1, లింగాలకు రెండు షాపులు మంజూరయ్యాయన్నారు. మద్యం షాపుల్లో భాగంగా 50వేల కంటే జనాభా అధికంగా ఉన్న పులివెందుల, వేంపల్లెలకు 65 లక్షలు లైసెన్సు ఫీజు ఉంటుందన్నారు. మిగిలిన మండలాలకు రూ.55 లక్షలు లైసెన్సు ఫీజు ఉంటుందని, అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు ఈఎండీ లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తుకు సమయం ఉందన్నారు. 11వ తేదీ లాటరీ పద్ధతిలో జిల్లా పరిష్ కార్యాలయంలో కలెక్టరు ఆధ్వర్యంలో టెండర్లు డ్రా తీస్తామన్నారు. ఆసక్తి గలవారు ఎవరైనా ఆన్‌లైన్‌లో మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అపోహలను నమ్మవద్దని ఆయన తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాల సమాచారం తెలపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రంగారావు

చక్రాయపేట, అక్టోబరు 5: గ్రామాలలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణల సమాచారం తెలపాలని ఎస్ఐ రంగారావు పేర్కొన్నారు. శనివారం చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని మ హిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించిన నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా గ్రామాలలో జరిగే చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలలో మీరే బాధ్యత వహించి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

కేటాయించిన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి

● అడిషనల్ కమిషనరు రాకేశ్‌చంద్రన్



చెత్తను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనరు రాకేశ్‌చంద్రన్

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5: పారిశుధ్య కార్మికులకు కేటాయించిన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్ తెలిపారు. శనివారం నాగరాజుపేట ఓల్డ్ బస్టాండు, సన్‌రైజ్ హాస్పిటల్ ప్రాం తాల్లో ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులకు కేటాయించిన ప్రాంతాలను ఎప్పటిప్పుడు పరిశుభ్రపరుచుకోవాలన్నారు. అనంతరం కార్మికుల హాజరు పట్టీని పరిశీలించారు.

ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును తరలించడం అన్యాయం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎండీ విజయజ్యోతి



మట్లాడుతున్న విజయజ్యోతి

కడప(కలెక్టరేట్), అక్టోబరు 5: నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును తరలించడం అన్యాయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి అన్నారు. ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడప స్టీల్ ఫ్యాక్టరీ సాధనకు కాంగ్రెస్ శ్రేణులు పోరాటాలకు సిద్ధమన్నారు. అనంతరం షైనుద్దీన్‌ను మళ్లీ పార్టీలో చేర్చుకున్నారు. పీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

పక్కా గృహాలు పూర్తి చేయాలి

ముద్దనూరు, అక్టోబరు 5: అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో ముకుందారెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 370 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని, లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రవికుమార్, ఏవో అరుంధతి పాల్గొన్నారు.

శారదాదేవి..నమోస్తుతే...

దసరా ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల వేడుకలు అంబరాన్నంటాయి. మూడవ రోజు కావడంతో అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఇక ప్రొద్దుటూరులో ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా ఆలయాలకు తరలివస్తున్నారు. నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రొద్దుటూరుటౌన్, అక్టోబరు 5: ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో మూడవ రోజు శారదాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను కరుణించారు. అమ్మవారిశాలలో, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శారదాదేవి అలంకారంలో, చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మిగా, భక్తులను కరుణించారు. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న బొమ్మల కొలువులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మూడవ రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించారు.

జమ్మలమడుగు: మూడవ రోజు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి గజలక్ష్మిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ముద్దనూరు రోడ్డులోని సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరీదేవి గాయత్రీదేవి అలంకారంలో, నాగులకట్ట చౌడేశ్వరీదేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో, పట్టణంలోని ప్రసన్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి, నారాపురం వెంకటేశ్వరస్వామి, కన్నెలూరులోని గంగమ్మ దేవాలయం, చౌడేశ్వరీదేవాలయం, కుందావారి వీధిలోని శివాలయంలో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.

బద్వేలురూరల్: వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వాతినక్షత్రం సందర్భంగా స్వామివారికి 18 రకాల కూరగాయలతో సుమారు 300 కేజీలతో శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దాతలు ఆర్టీసీ డీఎం శ్రీనివాసులు సహకరించగా, పట్టణానికి చెందిన రామయ్య సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

అలాగే కొండాపురం మండలంలో.. దత్తాపురం పెద్దమ్మగుడిలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ముద్దనూరులో.. వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆయలంలో మీనాక్షిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఎర్రగుంట్లలో.. అమ్మవారిశాలలో దేవి వనవిహారిణి అలంకారం నిర్వహించారు. అలాగే ఏరువాక గంగమ్మ ఆలయంలో శారదాదేవి అలంకారం, చౌడేశ్వరీదేవి ఆలయంలో భవానిదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే కాశినాయనలో.. నర్సాపురంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పోరుమామిళ్లలో.. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అలంకరించారు. బద్వేలుటౌన్‌లో.. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అష్టలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమివ్వగా మహాలక్ష్మీదేవాలయంలో గజలక్ష్మిదేవి అలంకారం, వీరభద్రస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. గోపవరంలో.. బద్వేలు - నెల్లూరు ప్రధాన రహదారిలో వెలసిన మహిమాన్విత సిద్దమ్మతల్లి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఖాజీపేటలో.. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారం, మైదుకూరులో.. ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నారు. మూడవ రోజు అయిన శనివారం స్థానిక అమ్మవారిశాలలో వాసవిమాత పార్వతీదేవి అలంకారంలోనూ, మాధవరాయ స్వామి ఆలయంలో పార్వతీదేవిగా దర్శనమిచ్చారు.

బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధానంలో మూడోరోజు ఉత్సవాలు ఘనంగా చేపట్టారు. అలాగే గంగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసియున్న త్రిముఖ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాలు మూడో రోజు ఘనంగా చేపట్టారు.


ప్రొద్దుటూరులో.. శారదాదేవిగా


ప్రొద్దుటూరులో ధైర్యలక్ష్మిగా


బద్వేలులో శాకాంబరి అలంకారంలో


జమ్మలమడుగులో.. గజలక్ష్మీదేవి అలంకారం


ఎర్రగుంట్లలో వనవిహారిణి అలంకారం


ఖాజీపేటలో.. రాజరాజేశ్వరీదేవి అలంకారం


ముద్దనూరులో.. మీనాక్షిదేవి అలంకారం

ఎంపీడీవోగా భాస్కర్‌బాబు



అట్లూరు, అక్టోబరు 5: అట్లూరు ఎంపీడీవోగా భాస్కర్‌బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇదే కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తూ పై అధికారుల ఉత్తర్వుల మేరకు ఎఫ్ఏసీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సుజాతమ్మ నందలూరుకు బదిలీ అయ్యారు.

గోపవరం ఎంపీడీవోగా రామనాథ్‌రెడ్డి..



గోపవరం, అక్టోబరు 5: ఎంపీడీవోగా రామ్‌నాథరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సభా భవనంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తానన్నారు.

మైలవరానికి రామచంద్రారెడ్డి...



మైలవరం, అక్టోబరు 5: ఎంపీడీవోగా వై.రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఉన్న ఎంపీడీవో శంషాద్‌బాను పెద్దముడియం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తానన్నారు.

జమ్మలమడుగుకు సైదున్నిసా..

జమ్మలమడుగు, అక్టోబరు 5: జమ్మలమడుగు నూతన ఎంపీడీవోగా సైదున్నిసా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూలు జిల్లా నుంచి బదిలీపై జమ్మలమడుగుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ జమ్మలమడుగు మండలంలో సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

రాజుపాలెంకు వెంకటరమణారెడ్డి..



రాజుపాలెం, అక్టోబరు 5: ఎంపీడీఓగా ఎ.వెంకటరమణారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వీరపునాయునిపల్లె మండలంలో ఎంపీడీవోగా పనిచేసి ప్రస్తుతం రాజుపాలెం మండలానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానన్నారు.

ఖాజీపేట ఎంపీడీవోగా దివిజ బాధ్యతలు

ఖాజీపేట, అక్టోబరు 5: ఎంపీడీవోగా దివిజ శనివారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఆమె వేంపల్లె నుంచి ఖాజీపేటకు బదిలీ అయ్యారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆమె సూచించారు.

తహసీల్దారుగా అక్బర్‌బాషా

దువ్వూరు(మైదుకూరు), అక్టోబరు 5: మండల తహసీల్దారుగా అక్బర్‌బాషా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా దువ్వూరులో విధులు నిర్వహిస్తున్న మధురవాణిని కలసపాడుకు బదిలీ చేయగా, అక్బర్‌బాషను దువ్వూరుకు బదిలీ చేశారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక


త్యాగరాజురెడ్డి, సాయిప్రసాద్, వరుణకుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 5: వైద్యుల సంక్షేమంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రొద్దుటూరు నూతన కార్యవర్గం ప్రకటించింది. శనివారం స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఏ భవనంలో కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ వైద్యుడు డాక్టర్ త్యాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సాయిప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

కాశినాయన కాంస్య విగ్రహ ప్రతిష్ఠ

కాశినాయన అక్టోబరు 5: పాపిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని కనెక లగుడం వద్ద శనివారం కాశినాయన కాంస్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇక్కడ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠను పురష్కరించుకొని భక్తులకు అన్నదానం, కోలాటం, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎండలు అధికంగా ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చలువపందిళ్లు, మంచినీరు, మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల

బద్వేలు, అక్టోబరు 5: ఎక్సైజ్ పాలసీ (2024-26)లో భాగంగా ప్రస్తుతం బద్వేలు ఎక్సైజ్ సర్కిల్‌లో 15 మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు బద్వేలు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బద్వేలు మున్సిపాలిటీలో 6 షాపులకు గాను, రూరల్ నందు ఒక షాపు, గోపవరం మండలానికి సంబంధించి ఒక షాపు, కలసపాడు మండలంలో రెండు షాపులు, పోరుమామిళ్లలో 4 షాపులకు టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు 9వ తేది ఆఖరి రోజు అని 11వ తేది కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, అక్టోబరు 5: జమ్మలమడుగు పట్టణం, గ్రామాల్లో, మైలవరం, పెద్దముడియం మండలాలకు సంబంధించి కొత్త మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సరితారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. జమ్మలమడుగు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలోని నగర పంచాయతీలో 8 దుకాణాలు, రూరల్ పరిధిలో రెండు దుకాణాలు, మైలవరం మండల పరిధిలో మూడు దుకాణాలు, పెద్దముడియం మండలంలో ఒక దుకాణాలకు లైసెన్సులు జారీ చేశామని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుడు నిబంధనల ప్రకారం రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9440902601, 6281363882 నంబర్లకు సంప్రదించాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్సీ

జమ్మలమడుగు, అక్టోబరు 5: నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కార్యకర్తలకు, నాయకులకు భరోసా ఇచ్చారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపాన నూతనంగా వైసీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ర్యాలీగా వెళ్లి నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దగ్గరలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందులకు వచ్చినప్పుడు తనను జమ్మలమడుగులో యాక్టీవ్‌గా ఉండి కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండాలని చెప్పారని, అందులో భాగంగా నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు తాను అండగా నిలుస్తానన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దగ్గర ఉన్న కార్యకర్తలు, నాయకులు మొత్తం శనివారం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కార్యాలయం వద్దకు చేరుకున్నట్లు తెలిసింది.


విలేకరులతో మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి

సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగులోని ఆయన కార్యాలయం వద్దకు వచ్చి కార్యకర్తలను, నాయకులకు ఫోన్లు చేసినా స్పందన లేదని తెలిసింది. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి, కేకే రమణారెడ్డి, కొమెర్ల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ ముల్లాజానీ, పొన్నపురెడ్డి శివారెడ్డి, గిరిధర్‌రెడ్డి, జడ్పీటీసీ మహాలక్ష్మి, సర్పంచ్ జయశ్రీ, రామాంజనేయులుయాదవ్, ఉప్పలపాడు యోబు, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, యనమల పురుషోత్తంరెడ్డి, నారాయుడు, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు సేవలు విస్తరించాలి

● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


డీసీసీ బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, అక్టోబరు 5: డిస్ట్రిక్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీ) సేవలను విస్తరించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక రామేశ్వరం లోని మిట్టమడి వీధిలో డీసీసీ బ్యాంకు రామేశ్వరం బ్రాంచ్‌ను ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ బ్యాంకులో రైతులతో పాటు చిన్నచిన్న వ్యాపారులు, స్వయం సహాయక మహిళలకు రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో రాజమణి, డీసీఎల్‌వో రిజిస్ట్రార్ సురేష్, డీజీఎంలు వెంకటేశ్వర్లు, ప్రతాప్‌రెడ్డిలు, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకులు ఉపాధ్యాయులే

ప్రొద్దుటూరుటౌన్, అక్టోబరు 5: సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని యోగివేమన యూనివర్శిటీ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డీ టీచర్స్ అసోసియేషన్, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులను సన్మానించడం అభినందనీయమన్నారు. అనంతరం ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో 2015 నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, హరినారాయణ, చంద్రశేఖర్, రమణయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చాపాడు, అక్టోబరు 5: మండలంలోని వి.రాజుపాళెం గ్రామంలో శనివారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెన్నానది నుంచి ఇసుకను మైదుకూరుకు చెందిన నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకుని వాటిని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. వీటికి జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ యార్డు

మాజీ చైర్మన్ మృతి


బండి భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు, అక్టోబరు 5: ప్రొద్దుటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బండి భాస్కర్‌రెడ్డి గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకుడిగా, సర్పంచ్‌గా పనిచేశారు. రెండుసార్లు మార్కెట్‌యార్డుకు చైర్మన్‌గా వున్నారు. కాగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, బచ్చల పుల్లయ్య, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు, కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరుటౌన్, అక్టోబరు 5: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చని సూచించారు. అధ్యాపకుల బోధనలను శ్రద్ధగా విన్నప్పుడే పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలరని సూచించారు. ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనను పాటించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలరని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.